నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
మంగళవారం | ఏప్రిల్ 02, 2024 | www.navatelangana.com

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

సిర్పూర్(టి) : రానున్న పార్లమెంటు ఎన్నికలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో సిర్పూర్ పోలీస్‌స్టేషన్ ప్రధాన రహదారి గుండా కవాతు చేస్తూ లోనవెల్లి, డోర్‌పెల్లి వరకు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలు భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ఎన్నికలు నిర్వహిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరగాలన్నారు. కవాతులో కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్ఐ దీకొండ రమేష్, పారా మిలిటరీ దళాలు పాల్గొన్నాయి.



ప్రాణహిత కాలువలో దూకి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-బెజ్జూర్

ప్రాణహిత కాలువలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు కౌటాల సిఐ సాదిక్ పాషా తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని బారెగూడెం గ్రామానికి చెందిన మురుమురే ఉమేష్(25) ఆదివారం ఇంటి నుండి బయలుదేరి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. సోమవారం లంబాడిగూడ వద్ద ప్రాణహిత కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలాన్ని సిఐ సాదిక్ పాషా సందర్శించారు. మృతుడికి కొన్ని రోజులుగా మానసిక స్థితి బాగాలేదని, తల్లి సరోజన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



రైస్ మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

రేషన్ దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లలోనూ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్, దహెగాం, సిర్పూర్(టి) మండలాల్లోని పలు రైస్ మిల్లులలో సోమవారం పౌరసరఫరాల శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ నుండి వచ్చిన టాస్క్‌ఫోర్స్ టీం-3 అధికారి సుదర్శన్‌రెడ్డి ఇతర అధికారులు కాగజ్‌నగర్‌లో ఒకటి, దహెగాంలో ఒకటి, సిర్పూరు(టి) మండలంలోని మూడు రైస్ మిల్లులలో తనిఖీలు నిర్వహించారు. వీటితో పాటు కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యం నాణ్యతను పరిశీలించారు. అదేవిధంగా సిర్పూరు(టి) మండలంలోని లోనవెల్లి, డోర్‌పెల్లి గ్రామాలలో రేషన్ దుకాణాలలో కూడా బియ్యం తనిఖీలు చేసి నాణ్యత పరిశీలించారు. కార్డుదారులను కలిసి బియ్యం నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. ఈ విషయమై అధికారి సుదర్శన్‌రెడ్డిని సంప్రదించగా ఐదు రైస్ మిల్లులలో తనిఖీలు చేపట్టామని, కొన్ని మిల్లులలో ధాన్యం తక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. తమ తనిఖీ నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు



నవతెలంగాణ - సిర్పూర్(టి)

సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలకు తొమ్మిది మంది విద్యార్థులు అర్హత సాధించినట్టు జిల్లా కన్వీనర్ పోలోజు బాలరాజు తెలిపారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి అర్హత సాధించారని పేర్కొన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హైదరాబాద్‌లోని గౌలిదొడ్డిలో ముగ్గురు ఎంపీసీ గ్రూపులో, షేక్‌పేట బైపీసీలో ఇద్దరు, చిలుకూరులో ఎంపీసీ ఒకరు, ఇబ్రహింపట్నం సీఈసీ ఒకరు, కరీంనగర్ అల్గనూర్‌లో ఎంపీసీలో ఇద్దరు విద్యార్థులు అర్హత సాధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత విద్యలో రాణించి మంచిస్థాయిలో ఉండాలని అభినందిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. అభినందన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి ఫ్రాన్సిస్, ఉపాధ్యాయులు సూరజ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రాపర్తి రవీందర్ అన్నారు. బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆయన మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అభివృద్ధికి జూనియర్ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన కార్యదర్శి పిఎం. రాజీవ్‌రెడ్డి, కోశాధికారి ఎం.రామకృష్ణ, ఉపాధ్యక్షులు ఎస్.చంద్రకుమార్, సంయుక్త కార్యదర్శి ఎల్.నగేష్, కె.కిషోర్, మహిళ ప్రతినిధి రాపర్తి గాయత్రి, మధురిమ, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు విద్యాసాగర్, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రెటరీ జె.రాజేష్ ప్రమాణ స్వీకారం చేశారు. సీనియర్ న్యాయవాది జగన్మోహన్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. జిల్లా ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఓ రోగికి రక్తం అవసరం పడగా దాతను సంప్రదించి రక్తం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి పేద రోగులు వస్తారని, వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదు

- పీఓ, ఏపీఓల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పార్లమెంట్ ఎన్నికల విధుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ ఆర్డీఓ సురేష్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజు అవసరమయ్యే సామాగ్రిని ముందుగానే సరి చూసుకోవాలని అన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందే ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి వివి ప్యాట్‌లలో ఉండే స్లిప్‌లను ప్రత్యేక కవర్‌లో ఉంచాలని సూచించారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పోలింగ్ అధికారులకు అవగాహన ఉంటే విధుల నిర్వహణ సులభతరమవుతుందని అన్నారు. పీఓ, ఎపీఓలకు మూడు విడతలుగా శిక్షణ ఉంటుందని, మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమస్యలుంటే సెక్టోరియల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశాలున్నందున పోలింగ్ కేంద్రాలలో తగిన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 450 మంది ప్రిసైడింగ్ అధికారులతో పాటు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, తహసీల్దార్‌లు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల పరిశీలన

పార్లమెంట్ ఎన్నికలలో ఉపయోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత కోసం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సోమవారం కలెక్టర్ వెంకటేష్ ధోత్రే పరిశీలించారు. స్థానిక సెయింట్ క్లారెట్ పాఠశాలలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఆయన పరిశీలించారు. ఈ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో నిరంతరం రక్షణ ఏర్పాట్లను చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాలకు సరిపడా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లను కేటాయించడం జరుగుతుందని, అదనంగా కూడా అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే టోల్ ఫ్రీ నెం. 1950, సీ విజిల్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

ఆసిఫాబాద్ : ఎన్నికల్లో విధులు నిర్వహించాల్సిన సిబ్బందికి పోలింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల అధికారి కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజేంద్రప్రసాద్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బంది విధులపై అవగాహన కల్పించారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే పిఓ, ఏపీఓలకు ఈవీఎం వివి ప్యాట్‌లపై పూర్తిస్థాయిలో అవగాహన కల్గి ఉండాలన్నారు. 17 సి డైరీలో రాసే ప్రతి అంశంతో పాటు, ఎన్నికల రోజు నింపే వివిధ ఫారాలు, పూర్తి అయిన తర్వాత ప్యాక్ చేసే కవర్ల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల రోజు మాక్ పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. సిబ్బంది ఎలాంటి తప్పులు లేకుండా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్డిఓ సురేందర్, ఆసిఫాబాద్ తహసీల్దార్ శ్రీనివాసరావు, శిక్షకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో యాసంగి పంట వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ఇందారపు పుష్పలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంట పండించిన రైతులు వారివారి పంటను కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలని, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని అన్నారు. ఏ- రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.2203, బీ గ్రేడ్ క్వింటాల్ వడ్లకు రూ.2183 రైతులకు చెల్లించబడుతుందని తెలిపారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి పండించిన పంటను విక్రయించాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకొచ్చే ముందు పట్టా పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ ప్రతులను రెండు సెట్లు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ రాజేష్, మండల వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఐకేపీ సీసీలు శంకర్, కల్పన పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : మండల కేంద్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం సీఈఓ రాకేష్ వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చే సమయంలో తమ వెంట ఆధార్‌కార్డు, పాస్ పుస్తకం, ఏవో లేదా ఏఈఓ ధృవీకరణ పత్రం, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కవిత, సురేష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గురుడుపేట్ ఆధ్వర్యంలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘం సీఈఓ రాజేష్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కౌటాల : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ పుష్పలత



సిర్పూర్(టి)లో..

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేసవి అయినందున ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి ఇతర కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులతో తాగునీటి ప్రణాళిక, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య లేకుండా కార్యాచరణ ప్రకారం నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని తెలిపారు. మిషన్ భగీరథ పైప్ లైన్లు, చేతి పంపులు మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసి చేస్తే నిరంతరాయంగా నీటి సరఫరా చేయాలని తెలిపారు.

ప్రభుత్వం రైతుల నుండి వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో జిల్లాలలో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలను రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు ఓఆర్ఎస్, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని, ప్రత్యేక అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారుల సమన్వయంతో తాగునీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీ, చేతి పంపుల మరమ్మతు చర్యలు చేపట్టడంతో పాటు వ్యవసాయ బోరు బావులు అద్దెకు తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానికంగా అన్ని వనరులను ఉపయోగించుకుంటూ నీటి కొరత ఉన్న ప్రాంతాలలో ప్రత్యామ్నాయంగా గ్రామపంచాయతీ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మండలానికి ఒకటి చొప్పున ప్రారంభించామని తెలిపారు. మిగిలిన కేంద్రాలను ఈ నెల 8 వరకు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, మిషన్ భగీరథ ఈఈ వెంకటపతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల పని వేళలు మార్చాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల పని వేళలను వెంటనే మార్చాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షులు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతున్నందున కార్మికులు అనారోగ్యం పాలయ్యే అవకాశాలున్నాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులకు, కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు రెస్ట్ ఇవ్వాలని తెలిపారు. కార్మికులందరికీ ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని యాజమాన్యాని కోరారు.

ఆదిలాబాద్‌ను అగ్రభాగాన నిలపడమే లక్ష్యం : మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అగ్రభాగాన నిలపడమే కాంగ్రెస్ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి తమ పార్టీతోనే సాధ్యమన్నారు. జిల్లా ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అక్షర క్రమంలో మొదట ఉన్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం అట్టడుగు బాగాన ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో కడెం, వట్టి వాగు, అడ, చెలిమెల లాంటి ఎన్నో ప్రాజెక్టులు ఉన్నప్పటికీ గత ప్రభుత్వ హయాంలో ఎక్కడ కూడా రెండు పంటలకు నీరిచ్చిన దాఖలాలు లేవన్నారు. రానున్న రోజుల్లో ఆ కష్టాలు తీర్చే ప్రయత్నం చేయనున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, ఓయూ జెఏసి నాయకుడు అనిల్, జిల్లా నాయకులు సిడాం గణపతి, మండల అధ్యక్షులు చరణ్ మసాదే, నారాయణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాల్య వివాహాలు చట్టరీత్య నేరమని జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేష్ అన్నారు. మండలంలోని పర్శ నంబాల గ్రామంలో జరుగుతున్న బాల్యవివాహాన్ని ఆపి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయటం వల్ల చట్టపరమైన, ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురవుతాయన్నారు. అమ్మాయికి 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని సూచించారు. బాల్య వివాహాన్ని లిఖితపూర్వకంగా వాయిదా వేయించారు. జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు పగడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, గ్రామస్థాయిలో బాలల సంరక్షణ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎక్కడైన బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా ఈఆర్ఎస్ఎస్ 112 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలని, బాల్య వివాహం చేస్తే చట్ట ప్రకారం ఇరు కుటుంబాలపై, వివాహాన్ని జరిపించిన పూజారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాల రక్ష భవన్ సిబ్బంది చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రవళి పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తుందని, ఈ అవకాశాన్ని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని లెప్రసీ ప్రోగ్రాం అధికారి సుధాకర్ నాయక్ అన్నారు. సోమవారం సిర్పూర్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమంలో పలువురు వ్యాధిగ్రస్తులను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు దీర్ఘకాలిక వ్యాధులకు పేద ప్రజలు వైద్యం చేయించుకోలేక అలాగే ఉండిపోతున్నారని గుర్తించి వైద్యం అందించడానికి చర్యలు తీసుకుంటున్నాయన్నారు. ఇందులో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తులు గుర్తింపు ఉద్యమాన్ని గత నెల 11న ప్రారంభించి 24 వరకు కొనసాగిస్తామని తెలిపారు. లోనవెల్లి పీహెచ్‌సీ పరిధి గ్రామాల్లో వైద్య బృందం పరిశీలించి తెల్లమచ్చలు ఉన్న 65 మందిని అనుమానితులుగా గుర్తించి వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సీతారామ్ నాయక్, డీపీఎంఓ శ్యాంనాయక్, హెచ్ఈఓ కోటేశ్వర్, వైద్యులు నవత, అశ్విని, సహజ, హెచ్‌వీ సునీత, హెచ్ఎస్ పద్మావతి, హెచ్ఎ నర్సయ్య, రాజలింగం, లాల్‌సింగ్, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

అందుబాటులో ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 7న నిర్వహించనున్న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష హాల్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో 6 నుండి 10వ తరగతులలో ప్రవేశం కొరకు ప్రవేశ పరీక్ష ఈ నెల 7న ఆదివారం నిర్వహించబడుతుందని తెలిపారు. 6వ తరగతికి 10 నుండి 12వరకు, 7 నుండి 10వ తరగతులకు 2 నుండి 4 గంటల వరకు మండల కేంద్రంలో పరీక్ష ఉంటుందన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | ఏప్రిల్ 02, 2024 | www.navatelangana.com

పీహెచ్‌సీల్లో డెలివరీల సంఖ్య పెరగాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



పీహెచ్‌సీల్లో డెలివరీల సంఖ్య పెరిగేలా ఆస్పత్రి సిబ్బంది కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా ఆస్పత్రిలోని ఓపీ రిజిస్టర్‌తో పాటు ఎంసీహెచ్, డెలివరీ రిజిస్టర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వైద్య సిబ్బంది మారుమూల గ్రామస్తులతో మమేకంగా ఉంటూ ప్రభుత్వాస్పత్రిల్లో ప్రసవాలు జరిగేలా, ప్రభుత్వాస్పత్రిలోనే గర్భిణీ స్త్రీలు నెలనెల చికిత్సలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాకుండా వేసవి కాలంలో వచ్చే రోగులకు కావాల్సిన చికిత్స కోసం ముందుగానే మందులు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు బీమ్‌రావు, అలేఖ్య పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

నవతెలంగాణ-లక్ష్మణచాంద



రైతులు దళారులను నమ్మి మోస పోవద్దని, ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాల్లోనే వరి దాన్యం అమ్ముకోవాలని డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా మేనేజర్ ప్రమోద్, వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం డీసీఎంఎస్ లక్ష్మణచాంద ఆధ్వర్యంలో మండల కేంద్రంలో, పీచర గ్రామంలో సోమవారం వరికొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలోనే వరి ధాన్యం అమ్ముకోవాలని అన్నారు. ఏ గ్రేడ్ ధర రూ.2,203 ఒక క్వింటల్‌కు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు జాదవ్ ఉమ, పవిత్ర, సిబ్బంది పాల్గొన్నారు.

అసమ్మతి నాయకులకు బుజ్జగింపులు

• ఎంపీ అభ్యర్థులు ముగ్గురూ ఆదివాసులే..! • కీలకంగా మారనున్న బంజారా, గిరిజనేతరుల ఓట్లు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం ఎస్టీ రిజర్వు కావడంతో ఆదివాసీ, గిరిజనుల్లో తీవ్ర పోటీ నెలకొంది. ఎంపీ స్థానానికి ఆయా పార్టీల అభ్యర్థుల నుంచి పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అయినప్పటికీ ప్రధాన పార్టీలు మాత్రం పార్టీకి సేవ చేసిన వారికి కాకుండా కొత్తగా పార్టీలో చేరిన వారికి మాత్రమే ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. బీఆర్ఎస్ మాత్రం పార్టీకి సేవ చేసిన ఆత్రం సక్కును ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. ప్రధాన మూడు పార్టీల్లో కూడ ఎంపీ స్థానాన్ని ఆదివాసులకే కేటాయించారు. దీంతో పార్టీలో ఉండి, సేవ చేసిన తమకు కాకుండా కొత్త వారికి టికెట్టు కేటాయించడాన్ని పలువురు నాయకులు తప్పుపడుతున్నారు. అదేవిధంగా అన్ని ప్రధాన పార్టీ గోండులకు టికెట్టు ప్రకటించడంతో, బంజారాలు అసంతృప్తిలో ఉన్నారు. తమ నాయకులకు టికెట్టు కేటాయించ లేదని, తమను పరిగణలోకి తీసుకోక పోవడాన్ని తప్పు బట్టారు. అదేవిధంగా టికెట్టు ఆశించి, భంగ పడ్డవారిని బుజ్జగించేందుకు టికెట్టు పొందిన అభ్యర్థులు నాయకుల ఇండ్లకు వెళ్లి తమకు పూర్తి మద్దతివ్వాలని కోరుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో అభ్యర్థుల గుండెల్లో రైళ్ల పరుగెడుతున్నాయి. తమదైన శైలిలో ప్రచారంలో దూసుకు పోతున్నారు. ఇటు కాంగ్రెస్, బీజేపీలోను పార్టీ జెండా పట్టిన వారికి ఎంపీ టికెట్టు దక్కక పోవడంతో అసమ్మతి సెగలు అలుముకున్నాయి. దీంతో పోటీ చేసే అభ్యర్థులు తూర్పు నుంచి పడమటి వరకు తనకు మద్దతు పలకాలని బుజ్జగింపు చర్యలు చేపడుతున్నారు. ఇటీవల బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ ఆ పార్టీ టికెట్ ఆశించిన రాథోడ్ రమేష్ ఇంటికి వెళ్లి కలువడం విశిష్టతను సంతరించుకుంది. ముగ్గురు అభ్యర్థులు గోండు ఆదివాసీ తెగకు చెందిన వారే కావడంతో ఓటర్లు సందిగ్ధంలో పడుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌కు గిరిజనేతరుల్లో మంచి పట్టు ఉంది. ఆయన గెలుపుకు గిరిజనేతరుల ఓటర్లే కీలకంగా మారనున్నాయి. ఇక కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు అధికార కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలే ప్రచారాస్త్రంగా మలుచుకొనే అవకాశముంది. ఈమె తనదైన శైలిలో ప్రచారంలో దూసుకుపోతోంది. ఇక బంజారా అభ్యర్థులకు ఏ పార్టీ నుంచి టికెట్టు దక్కక పోవడంతో వారి మద్దతు ఎవరికి దక్కుతుందోని ప్రశ్నార్థకంగా మారింది.



బీఆర్ఎస్ అభ్యర్థి తరపున ప్రచారంలో బదావత్ పూర్ణచందర్



మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌ను కలిసిన బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్



మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిసిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

ఓటు నమోదుపై కళా బృందం అవగాహన



నవతెలంగాణ-తాంసి

18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరుతూ సోమవారం భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలో కళా బృందం సభ్యులు ఎస్సై ప్రదీప్ కుమార్ అవగాహన కల్పించారు. మొదటగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన ప్రతి యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకొని అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ వివేకానంద బోధనలు ఆచరణలో పెడితే సమాజ ప్రగతి సుసాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు రమేష్, నర్సమ్మ, వెంకట్‌రావు, మురళీ, శంకర్, మాజీ సర్పంచ్ రాజన్న, అనిల్, ముకుంద్ ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయశాఖ, సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, డాక్టర్ రాజశేఖర్‌లు సేంద్రియ వ్యవసాయం, రైతు ఉత్పత్తిదారుల సంఘం అవశ్యకత గురించి అవగాహనా కల్పించారు. సేంద్రీయ వ్యవసాయం ఆవశ్యకత, ఎలా చేయాలి, వాటి పద్ధతులు, మార్కెటింగ్ సదుపాయం గూర్చి రైతులతో చర్చించారు. రైతులు ఒంటరిగా వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకోవడం వలన ఎక్కువగా నష్టాల బాట పడుతున్నారని, రైతులు సంఘటితం అయ్యి రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడితే మంచి ధరలకు అదేవిధంగా సులువుగా తమ ఉత్పత్తులను అమ్ముకునే వీలు ఉంటుందని తెలిపారు. సేంద్రీయ వ్యవసాయంలో శిక్షణ, మార్కెటింగ్ మెలుకువలు సీఎస్ఏ ద్వారా సహకారం అందిస్తామని రైతులకు తెలిపారు. ఈ సమావేశంలో తాత్కాలికంగా సేంద్రీయ సాగు రైతుల కార్యవర్గం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, మండల రైతులు పాల్గొన్నారు.

ఆభా హెల్త్ కార్డు కోసం ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్

ప్రజలు ఆభా హెల్త్ కార్డు కోసం ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని దుర్గానగర్, విజయ్‌నగర్ కాలనీలో వైద్య సిబ్బందితో ఆభా కార్డు కోసం ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయించారు. ప్రతి ఒక్కరూ వైద్య సిబ్బంది దగ్గర పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఆభా డ్రైవ్ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్ వైద్య సిబ్బంది హిమబిందు, విద్యారాణి, ఆశా పంచుబాయి ఉన్నారు.

ఆనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడి మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని లాల్‌టెక్డి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రాథోడ్ గణేష్ ఆనారోగ్యంతో బాధపడుతూ రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్టు కుటుంబీకులు తెలిపారు. ఆదివారం అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు అయనకు 108 అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్లు తెలిపారు. 2004 నుంచి అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హాయంలో నుంచి కాంగ్రెస్‌లో పని చేస్తున్నాడు. 2008లో ఆతని సతీమణి జెడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆతని మృతి పట్ల వారి కుటుంబంతో పాటు ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం..!

• ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలి
• కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఖానాపూర్

కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఖానాపూర్ మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధితో పాటు పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత కరెంటుతో పాటు రూ.500లకు గ్యాస్ అందిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు సొంత నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. సరస్వతి కెనాల్ ద్వారా రైతులకు నీళ్లు ఇచ్చి ఆదుకుంటామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ చూపి అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం కార్యకర్తలు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

అగ్గి మల్లన్న ఆలయంలో ప్రత్యేకపూజలు

ఖానాపూర్ మండలంలోని తర్లపాడు గ్రామంలో అగ్గిమల్లన్న ఆలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఎమ్మెల్యేకు శాలువాతో సత్కరించారు.

పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే...

ఖానాపూర్ మండలం మస్కపూర్ గ్రామంలోని పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు గొప్ప లక్ష్యాలను పెట్టుకొని ఉన్నతంగా చదవాలన్నారు. మహిళా సాధికారత కోసం నీస్సీ స్కూల్ యాజమాన్యం విద్యాలత కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ ఆట పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. స్కూల్ యాజమాన్యం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. వేరువేరుగా జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షులు దొనికేనీ దయానంద్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ రాజుర సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రటరీ షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, జంగిలి శంకర్, గ్రామ అధ్యక్షులు బిక్కు నాయక్, కొడరి నరేష్, మాజీ సర్పంచ్ చిన్న రాజన్న, కాన్షిరామ్ నాయక్, అంబాజి, మాజీ సర్పంచ్ సుతారి రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, బాలం బీమన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందించిన వారికి గుర్తింపు

• సుశీలను సన్మానించిన మాల సంక్షేమ సంఘం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని మాల సంక్షేమ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన యేర సుశీలను మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం మావలలోని ఆమె నివాసంలో శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 33 ఏండ్ల పాటు సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. చిన్నపాటి పొరపాట్లకు తావివ్వకుండా ఉద్యోగులు, అధికారుల మన్ననలు పొందారని అన్నారు. శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం నాయకులు అర్క రమేష్, సాయిబాబా, క్రాంతి కుమార్, ప్రశాంత్, సూర్యవరప్రసాద్, బేర శ్రీనివాస్, అర్క దేవిదాస్, ఎంబడి మధుసూదన్, స్వామి, వంశీ, పెరమళ్ల నారాయణ, సుధీర్ పాల్గొన్నారు.

నంది పురస్కారాలు అందుకున్న తండ్రీకూతురు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ప్రేమతో నాన్న లఘు చిత్రం దర్శకత్వం వహించి, నటించిన నిర్మల్ ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డా.వేణుగోపాలకృష్ణ ఆదివారం నంది పురస్కారమందుకున్నారు. ఉత్తమ చిత్రంతో పాటు ఉత్తమ దర్శకత్వం కు గాను ఈ పురస్కార గౌరవం పొందారు. విభిన్న భావాల్ని పలికించి, ఆంగీకం, వాచకం, నాట్యంతో పాటు అద్భుతంగా నటించిన సుహాసిని కి ఉత్తమ నటి నంది అవార్డు లభించింది. ఇద్దరు వైద్య విద్యకు సంబంధించిన వారై ఇద్దరు తండ్రి కూతుళ్లు కావడం విశేషం. హైదరాబాద్ బిర్లా సైన్స్ సెంటర్లో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తండ్రి కూతుళ్లు ఇద్దరు నంది పురస్కారాలు అందుకున్నారు. ప్రేమతో నాన్న చిత్రానికి గాను అవార్డులు పొందారు. ఈ కార్యక్రమంలో సుహాసిని సంప్రదాయ భరతనాట్యాన్ని ప్రదర్శించారు. ప్రముఖ నిర్మాత, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణతో పాటు రుద్ర శ్రీనివాస్, ఇతర సినీ ప్రముఖులు నంది అవార్డులు అందించి, ప్రశంసించారు.



సమ్మర్ యాక్షన్ ప్లాన్ పూర్తి చేయాలి

• అధికారులతో కలెక్టర్ సమావేశం • నీటి ఎద్దడి లేకుండా చర్యలు • కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని, సమ్మర్ యాక్షన్ ప్లాన్ రెండు రోజుల్లో అందజేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలపై, అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ, లేబర్, మొబలైజేషన్, స్కూల్ డ్రెస్సెస్ స్టిచింగ్, పోస్టల్ పేమెంట్, పీఎంకేఎస్‌వై వర్క్ ప్రోగ్రెస్, తదితర అంశాలపై ఆయా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నీటి ఎద్దడి ఉన్నచోట ట్యాంకర్స్ ద్వారా ఇంటింటికి నీటిని సరఫరా చేయాలని అన్నారు. గ్రామాల్లో ప్రస్తుతం తాగునీటి సరఫరా, బోర్లు, ఓపెన్ బావులు, నీటి వనరుల గురించి మండలాల వారిగా ఎంపీడీఓ, ఎంపీఓ, ఏఈలను ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందో అడిగి తెలుసుకున్నారు. తాగునీటి విషయమై పైప్‌లైన్, మోటార్ల మరమ్మతులు తదితరాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి సమస్య లేకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అన్నారు. మిషన్ భగీరథ నీరు రాని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

పాత తాగునీటి వనరులు పున:రుద్ధరించాలి..

తాగునీటి సరఫరాలో వచ్చే చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. బోరుబావులు, పాత తాగునీటి వనరులు పున:రుద్ధరించాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలు బావుల వద్దకు, బయటకు రాకుండా ఇంటింటికి నీటిని సరఫరా చేయాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరాపై సమీక్షిస్తూ గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా క్షేత్ర స్థాయిలో నీటి లభ్యత, సరఫరాలపై పర్యవేక్షిస్తూ ఉండాలని పైపులైన్ లీకేజీలు ఉండకుండామరమ్మత్తులు చేయించాలని, అధికారులు హెడ్ క్వార్టర్ మెయింటెన్ చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీచే ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులకు సంబంధించిన పనులను పూర్తి చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మేజర్, మైనర్ మరమ్మతులు, టాయిలెట్లలను, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణ పనులు, విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్ వంటి మౌలిక వసతుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పాఠశాలలో పనులు పూర్తి చేయాలి..

ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనుల గురించి కార్యాచరణ రూపొందించుకోవాలని, ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనులు గుర్తించి, కమిటి తీర్మానాలు చేసుకోవాలని తెలిపారు. అనంతరం లేబర్ మొబలైజేషన్, నర్సరీ, స్కూల్ డ్రెస్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో ట్రైనీ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్డీఓ సాయన్న సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కళాకారులను కించపరచడం సరికాదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాటలు పాడి, డాన్సులు, ధర్నాలు, పబ్లిక్ మీటింగ్‌లు చేస్తే తెలంగాణ రాలేదని కళాకారులను కించపరిచేలా ఇటీవల సీనియర్ రాజకీయ నాయకులు కే.కేశవ్‌రావు మాట్లాడటం సమంజసం కాదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఉద్యమ గాయకులు ఇర్ఫాన్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ మొదలు పెట్టిన తెలంగాణ ఉద్యమాన్ని భావజాల వ్యాప్తి ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లింది పాట మాత్రమే అన్నారు. మలి దశ ఉద్యమ సమయంలో తెలంగాణ చరిత్ర, అవశ్యకత గ్రామాల్లోని ప్రజలకు అర్థమైందంటే అది కేవలం అనేక ధూమ్ ధాంల వేదికలపై పాటల ద్వారా మాత్రమే అన్నారు. అవసరానికి అనుగుణంగా కండువాలు మార్చినట్టు అప్పుడు కళాకారులు స్వరం మార్చి ఉండుంటే తెలంగాణ ఆకాంక్ష ప్రజలకు చేరేది కాదన్నారు. ఇప్పటికైనా కేశవ్‌రావ్ తెలంగాణ ఉద్యమంలో పాట పోషించిన పాత్ర ఏమిటో తెలుసుకొని కళాకారులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

లోకారిలో మద్యం పట్టివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



మండలంలోని లోకారి గ్రామంలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో తనిఖీలు చేశారు. లోకారి గ్రామానికి చెందిన మాడ సాయిరెడ్డి మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో ఇంట్లో సోదాలు చేశారు. 11.8 లీటర్ల లిక్కర్ పట్టుకున్నట్టు ఎస్సై ముజాయిద్ తెలిపారు. సుమారు రూ.13 వేలు ఉంటుందని తెలిపారు. రమేష్, దినకర్, మహేందర్ మాడ సాయిరెడ్డిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్టు తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ముథోల్

రైతులు వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈఓ సాయరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ రకం వరి ధాన్యం క్వింటాలుకు రూ.2203, బి, రకం వరి ధాన్యం క్వింటాలుకు రూ.2183 చెల్లించడం జరుగుతుందని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత వరి కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు దళారులకు దాన్యాన్ని విక్రయించి మోసపోకుండా ఉండేందుకే పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ డబ్ల్యూ ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి పట్ల హెల్త్ కేర్ సిబ్బంది జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

క్షయ వ్యాధి రాకుండా హెల్త్ కేర్ సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని షేర్ ఇండియా ఆర్గనైజేషన్ వైద్యులు సతీష్ తెలిపారు. సోమవారం క్షయ నివారణ కేంద్రంలో హెల్త్ కేర్ సిబ్బందికి టీబీ సోకకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. రోగుల నుంచి తెమడ, ఇతర పరీక్షలు, చికిత్సలు అందించే సమయంలో ఏ విధంగా ఉండాలో వివరించారు. ఈ సందర్భంగా షేర్ ఇండియా ఆర్గనైజేషన్ వైద్యులు సతీష్ మాట్లాడుతూ క్షయా నివారణ కేంద్రంలో పని చేసే హెల్త్ కేర్ సిబ్బంది వారికి టీబీ సోకకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. రోగికి చికిత్సలు అందించేసమయంలో మాస్కులు ధరించాలని సూచించారు. జాగ్రత్తలు పాటిస్తే వారికి టీబీ సోకకుండా ఉంటుందన్నారు. టీబీ రోగులను త్వరగ గుర్తించి చికిత్సలు అందిస్తే నివారణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షేర్ ఇండియా ఆర్గనైజేషన్ వైద్యుడు ప్రమోద్, క్షయా నివారణ కేంద్రం మేడికల్ ఆఫీసర్ సాయి ప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

సేవే లక్ష్యంగా పేదలకు వైద్య సేవలు అందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

వైద్య వృత్తిలో ఉన్నవారు సేవే లక్ష్యంగా పేదలకు వైద్య సేవలు అందించాలని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం నుంచి రిమ్స్ హౌజ్ సర్జన్లుగా విధుల్లో చేరిన వారికి ఆయన పలు సూచనలు చేశారు. వార్డులు తిరుగుతూ వారు అందిస్తున్న చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ రిమ్స్‌కు వచ్చే పేద రోగులకు సేవ భావంతో చికిత్సలు అందించాలన్నారు. తాము ఉన్నమనే భరోసా కల్పించేల సేవలుండాలని సూచించారు. రిమ్స్ 101 మంది కొత్త హౌజ్ సర్జన్లు వచ్చారని తెలిపారు. ఇక నుంచి రిమ్స్ మరింత నాణ్యమైన వైద్యలు అందుతాయన్నారు. రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే చికిత్సలు అందించేలా పూర్తి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

వైద్య కళాశాలలో 4న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద, గౌరవ వేతన పద్ధతిన వివిధ విభాగాలలో పని చేసేందుకు అర్హత గల అభ్యర్థులకు ఈ నెల 4న వాక్-ఇన్-ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొఫెసర్స్-22, అసోసియేట్ ప్రొఫెసర్స్-27, అసిస్టెంట్ ప్రొఫెసర్స్-45, సీనియర్ రెసిడెంట్స్-21 విభాగాలలో అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మాకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ అండ్ వెనరాలజీ, సైకియాట్రి, జనరల్ సర్జరీ, ఈఎన్‌టి, ఆప్తామాలజీ, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, అనస్తీసియా, రేడియాలజీలలో అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు స్వీయ ధ్రువీకరణ ప్రతులను జతపరిచి ఈ నెల 4 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించు వాక్-ఇన్-ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు.

గోలేటి క్రాస్ రోడ్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసిపి నుండి గోలేటి క్రాస్ రోడ్ వరకు సింగరేణి కార్మికులకు మూడు షిఫ్టులకు బస్సు సౌకర్యం కల్పించాలని సోమవారం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎస్ తిరుపతి ఆధ్వర్యంలో ఏరియా జీఎం డి రవిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైరిగూడ ఓసిపిలో పనిచేసే సింగరేణి కార్మికులకు బస్సు సౌకర్యం లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సింగరేణి కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే గోలేటి క్రాస్ రోడ్డు వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ బయ్య మొగిలి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు జగ్గయ్య, జూపక రాజేష్, దివాకర్, శేషు, కిరణ్, ఫిట్ సెక్రటరీ మారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల కోసం దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు స్కిల్ డెవలప్మెంట్ కోర్సులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు స్కిల్ డెవలప్మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. గతంలో ఇచ్చిన దరఖాస్తు గడువు ఈ నెల 15 వరకు పొడిగించామని తెలిపారు. సింగరేణి పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీయువకులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

శివాలయ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-బేల

మండలంలోని సాంగిడి గ్రామ సమీపంలోని పెన్‌గంగా నది తీరాన రూ.2కోట్లతో నిర్మించ తలపెట్టిన శివాలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ అట్టహాసంగా జరిగింది. గ్రామంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యులు, గ్రామస్తుల సహకారంతో ఈ మహా కార్య నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తెల్లవారుజామున 6 గంటలకు కొత్త సాంగిడి హనుమాన్ మందిరం నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. ప్రారంభమై పాత ఆయా గ్రామాల్లోని ప్రజలు కుటుంబ సమేతంగా మంగళహారతులు డప్పు వాయిద్యాలతో పాత సాంగిడిలోని సంత్ మోతీజి మహారాజ్ మందిరం మీదుగా గ్రామంలోని పుర వీధుల గుండా శివాలయ నిర్మాణ స్థలం వరకు శోభా యాత్ర కొనసాగింది. వేద పండితులు శాస్త్రోక్తంగా శివాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఐదుగురు ఉద్యోగుల జంటలు ప్రత్యేకపూజలు హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల శంకర్, మాజీ మంత్రి జోగు రామన్న, బీజేపీ నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి వేరువేరుగా హాజరై ఆలయ నిర్మాణానికి పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు చిప్ప రమేష్, సిద్రప్ అశోక్, సభ్యులు పాల్గొన్నారు.

హక్కులు కాపాడే రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం

- రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం
- పార్లమెంటు స్థాయి సన్నాహక సమావేశం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేదల హక్కులు కాపాడే రాజ్యం రావాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మావల మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పార్లమెంటు స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి సీతక్కతో పాటు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ముఖ్య అతిధిగా హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై శ్రేణులకు వారు దిశా నిర్దేశం చేశారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా అందరూ ఏకతాటిపైకి వచ్చి, బేషజాలు వీడి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్యాగాల కుటుంబం గాంధీ కుటుంబమన్నారు. పేదలు, బడుగు బలహీనవర్గాలకు పదవులు కట్టబెట్టిన త్యాగమూర్తులని గుర్తు చేశారు. త్యాగాల వారసత్వాన్ని పునికిపుచ్చుకుని మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న తమ అగ్రనాయకుడు రాహుల్ గాంధీని భావిభారత ప్రధానిగా చూడటమే లక్ష్యమన్నారు. పదేండ్లలో బీఆర్ఎస్, బీజేపీలు ఏం చేయలేదనే ప్రజలు ఇంటికి పంపించారని అన్నారు. ఆనాడు నల్లధనాన్ని వెలికితీసి ప్రతి పేదవాని ఖాతాలో రూ.15లక్షలను జమ చేస్తామని చెప్పి మోడీ మోసం చేశారన్నారు. ఈ దేశంలో పేదలకు అనేక హక్కులు కల్పించిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. ప్రతిఒక్కరూ చదువుకోవాలని విద్యాహక్కును కల్పించిందని, ఆహార భద్రత చట్టాన్ని తీసుకొచ్చిందని అన్నారు. కానీ ఇవాళ భక్తి పేరుతో, భగవంతుడి పేరుతో రాజకీయాలు చేస్తూ బీజేపీ పబ్బం గడుపుకుంటోందన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు దిశగా ముందుకు సాగాలి...

ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలను ఎలా ఎండగట్టామో, అదే రకంగా ఈ పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆ దిశగానే ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలందరి కృషితో రాష్ట్రంలో ఇవాళ మన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందన్నారు. అదేవిధంగా దేశంలోనూ మన ప్రభుత్వమే రావాలంటే ఖచ్చితంగా మన అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు. ఇప్పుడు చాలామంది అధికార పార్టీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఎందరు వచ్చిన కానీ పాత నాయకులు, కార్యకర్తలకు, ముఖ్యంగా కష్టపడేవారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ ఎంపీ అభ్యర్థులు వస్తే నిలదీయాలని అన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ కోసం, రిజర్వేషన్ల కోసం మాట్లాడిన సందర్భాలు లేవన్నారు. కానీ మేము ఈ ప్రాంత సమస్యలపై చట్టసభల్లో గళమెత్తుతామన్నారు.



మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు...

ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించేందుకు శాయ శక్తులా కృషి చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి సమక్షంలో చేరికలు జరిగాయి. ఆదిలాబాద్ రూరల్ మండలం లింగుగూడ, పట్టణంలోని కేఆర్‌కే కాలనీ, 4వ వార్డు, కోలీపుర, అనుకుంట, చాందా(టి), జైనథ్ మండలం లక్ష్మీపూర్ , లేఖర్‌వాడ, కరంజి, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తాజామాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పట్టణంలోని మాజీ కౌన్సిలర్లు పలు కాలనీ వాసులు కాంగ్రెస్‌లో చేరారు. అందరికి కండువాలు కప్పిన సీతక్క పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు సత్తు మల్లేష్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మాజీ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా అసెంబ్లీ ఇన్‌చార్జిలు ఆడే గజేందర్, శ్యాంనాయక్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, ఎస్టీ సెల్ జిల్లా చైర్మెన్ సెడ్మకి ఆనంద్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మెన్ దిగంబర్ రావు పాటిల్, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శాంతన్‌రావు, యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు చరణ్‌గౌడ్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, సీనియర్ నాయకులు భారత్ వాగ్మరే, గిమ్మ సంతోష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులు చేపట్టాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో మరమ్మత్తులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి విద్యాశాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టవలసిన మరమ్మత్తులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో 685 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి పాఠశాలల కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మండల స్థాయిలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టవలసిన పనులపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఏఈ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి, పాఠశాల కమిటీ సభ్యులు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో సెమినార్ ఏర్పాటు చేసి ఆయా పాఠశాలలలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై వివరించాలని తెలిపారు. పాఠశాలల భవనాలు, మూత్రశాలల మరమ్మత్తులతో పాటు నూతనంగా అవసరం ఉన్నచోట బాలికల కొరకు మూత్రశాలల నిర్మాణం, పాఠశాలలకు విద్యుత్ సరఫరా తదితర పనులను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ క్రమంలో ప్రతి పాఠశాల కమిటీ పేరిట బ్యాంకు ఖాతా తెరవాలని, ఇంజనీరింగ్ విభాగం అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించి అభివృద్ధి పనుల అంచనా విలువతో ప్రతిపాదనలను రూపొందించి అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అభివృద్ధి చేసే కాంగ్రెస్ పార్టీని ఆదరించాలి

- ఆదివాసీ ఆడబిడ్డను పార్లమెంటుకు పంపాలి
- మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఇచ్చోడ

అభివృద్ధి చేసే కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని, ఆదివాసీ ఆడ బిడ్డను పార్లమెంటుకు పంపాలని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసి అన్నదాతలందరినీ ఆదుకుంటామని అన్నారు. గతంలో మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా వివిధ హోదాలలో ఉండి నియోజకవర్గ అభివృద్ధిని మరిచారని అన్నారు. గత పాలకులకు అధికారమే లక్ష్యం, సంపాదనే ధ్యేయంగా పనిచేశారని వారిని ఈ పార్లమెంట్ ఎన్నికలలో ఓడించి ఉద్యమ నాయకురాలు, ఉపాధ్యాయురాలు ఆదిలాబాద్ ప్రజల ప్రశ్నించే గొంతుక ఆత్రం సుగుణని భారీ మెజారిటీతో గెలిపించి పార్లమెంటుకు పంపించాలని అన్నారు. అనంతరం బీజేపీ, బీఆర్ఎస్ నుంచి సుమారు 500 మంది కార్యకర్తలు, కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆదిలాబాద్ హక్కుల గొంతునవుతా : ఆత్రం సుగుణ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గిరిజన గిరిజనేతరుల హక్కుల కోసం సామాజిక ఉద్యమాలలో పాల్గొనాలని, రాజకీయాల నుంచి ఉద్యోగిగా ఉద్యోగం నుంచి రాజకీయాల్లోకి ప్రజాసేవ కోసమే వచ్చానని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు తనకు తెలుసునని ఈ ఆదిలాబాద్ జిల్లాలో ఒక పార్టీ అభ్యర్థి దొరగా, ఇంకో పార్టీ అభ్యర్థి దొరకడుగా ఉన్నారని వాళ్లకు విరుద్ధంగా ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ఆదిలాబాద్ ప్రజల హక్కులకు గొంతుగా, ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి, అస్తిత్వానికై పార్లమెంటులో నినదిస్తానని తనను ఆదరించాలని కార్యకర్తలని కోరారు. ఈ కార్యక్రమంలో బోథ్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, సిరికొండ, నేరడిగొండ, తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్‌లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి దుర్మరణం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మండలంలోని దుబ్బగూడా జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పంచాయతీరాజ్ సీనియర్ అసిస్టెంట్ పీవీ గోవిందరాజు(51) మృతి చెందారు. ఆదిలాబాద్ మండలం జందాపూర్ నుంచి తన భార్య మాధవితో కలిసి కారులో ఆదిలాబాద్‌లోని రాంనగర్‌కు వస్తుండగా ముందు వెళ్తున్న కంటేనర్ వాహనాన్ని వెనుకనుంచి ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. రాజు భార్య మాధవికి స్వల్ప గాయాలయ్యాయి. పీవీజీ రాజు జడ్పీ కార్యాలయం నుంచి ఇటీవలే డీఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మావల పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. మృతుడు గోవిందరాజుకు కూతురు, కుమారుడు ఉన్నారు. రాజు మృతి పట్ల సహచర ఉద్యోగులు డీఆర్డిఓ అధికారి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

సమిష్టిగా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి



నవతెలంగాణ-బోథ్

కేంద్రంలో అధికారంలో రావాలంటే ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఓడించిన విధంగా కేంద్రంలో బీజేపీని ఓడించాలని అన్నారు. కాంగ్రెస్ అధికారం లోకి వస్తే సామాన్య పేద ప్రజలకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. అనంతరం సొనాల గ్రామంలోని నాయకులను కలిశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, ఎంపీటీసీ మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, నాయకులు భోజన్న, నాగేందర్, రాజశేఖర్, సదాశివ్, అసిఫ్, అబ్రార్, పోతన్న, రమేష్, విజయ్ భాస్కర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

ముస్లిం మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లక్కారం గ్రామపంచాయతీకి చెందిన సామాజిక కార్యకర్త హనుమాన్ రైస్ డిపో యజమాని హనుమాన్ భక్తుడు జాదవ్ రవి, ప్రేమా భాయి దంపతులు లక్కారంలోని ముస్లిం మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అన్ని మతాల సారాంశం ఒకటే అని మనం చేసే ఉపవాస దీక్షలు శాంతి సామరస్యానికి ప్రతీక అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కరణ్, పవార్ గణేష్, జాదవ్ సుదామ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి



నవతెలంగాణ-బోథ్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజారిటీతో గెలిపించాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థితో కలిసి ఆయన మాట్లాడుతూ పల్లె పల్లె గ్రామ గ్రామన ఎంపీ విజయానికి అహర్నిశలు శ్రమించి కేంద్రంలో గులాబీ జెండా ఎగురవేసి నిరుపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అలాగే బీఆర్ఎస్ వెంట రైతన్నలు ప్రజలు అండగా ఉన్నారని వారే మా విజయ నిర్ణేతలు అని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు సంధ్యా రాణి, కుంమ్రం సుధాకర్, మండల కన్వీనర్, నారాయణ్‌రెడ్డి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు,పెటేల్లు, సర్మేడీలు నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ర్యాపిడ్ ఫోర్స్ కవాతు

నవతెలంగాణ-ఉట్నూర్

ముందస్తు ఎంపీ ఎన్నికలో భాగంగా ప్రజలు ఎలాంటి అవంచానియాలు జరగకుండా సోమవారం నర్సాపూర్ గ్రామంలో ర్యాపిడ్ ఫోర్స్ పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మొగిలి మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు గ్రామాల్లో ప్రశాంతంగా ఉండేలా చూడాలని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా శాంతి యుత వాతవరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మనోహర్ ర్యాపిడ్ ఫోర్స్ సీఐ, ఎస్ఐ, పోలీస్ బలగలు పాల్గొన్నారు.

దూరదర్శన్ స్ట్రింగర్ల ఎంపానెల్మెంట్‌కు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో దూరదర్శన్ కేంద్రం ప్రాంతీయ వార్తా విభాగం క్రింద స్ట్రింగర్ల ఎంపానల్ మెంట్ కొరకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఆర్ఎన్‌యూ హెడ్, సంయుక్త సంచాలకులు(వార్తలు) రాహుల్ గౌలీకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలో దరఖాస్తులు సమర్పించే ఆఖరి తేదీని ఏప్రిల్ 30 వరకు పొడిగించడం జరిగిందని, అభ్యర్థులు దరఖాస్తును డిమాండ్ డ్రాఫ్ట్, అనుబంధ పత్రాలతో జతపరిచి గడువు తేదీలోగా అందించాలని తెలిపారు. అభ్యర్థులు వివరాల కొరకు ఆన్‌లైన్‌లో ప్రసారభారతి.జీఓవీ.ఇన్/పీబీవీఏసీఎన్‌సీఐఈఎస్ వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, మందమర్రి సీఐ శశిధర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. పెద్ద అరడిపెల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు ఉన్నారు.

నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల, కళాశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. పాఠశాల అవసరాలకు అనుగుణంగా తరగతి గదులు, స్టాఫ్ రూమ్, టాయిలెట్ సౌకర్యాలు పాఠశాలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలన్నారు. మంచిర్యాల నియోజకవర్గ వ్యాప్తంగా మిగతా పాఠశాలల నిర్మాణాలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల అనంతరం మరిన్ని అభివృద్ధి పనులు ప్రారంభిస్తానని పేర్కొన్నారు. మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్, పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరిఫ్, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ షాహిద్ ఆలీ, పట్టణ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'బీజేపీ గెలిస్తే సింగరేణి ప్రశ్నార్థకమవుతుంది'

నవతెలంగాణ-నస్పూర్



రానున్న పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ గెలిస్తే సింగరేణి సంస్థ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాజారెడ్డి, మంద నరసింహారావు అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే గతంలో సింగరేణి బ్లాకులను వేలం వేసినట్లుగానే, మరల సింగరేణిని పూర్తిస్థాయిలో ప్రయివేటీకరిస్తుందని అన్నారు. సీఐటీయూ పోరాటాలతోనే కార్మికుల హక్కులు సాధ్యమావుతాయని, సింగరేణిలో మంచినీటి సౌకర్యార్థం గ్రావిటీ ఫిల్టర్‌లను ఏర్పాటు చేశారని, అలాగే సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ విద్య బోధన అమలుకు చొరవ తీసుకోవడం అభినందనీయమని అన్నారు. గుర్తింపు ఎన్నికల్లో గెలుపొందిన ఏఐటీయూసీ ఇప్పటివరకు ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోకుండా గుర్తింపు సంఘ కాలపరిమితి రెండు సంవత్సరాలకు బదులుగా నాలుగు సంవత్సరాలకు పొడిగించాలని ప్రయత్నాలు చేస్తూ ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవడం లేదని ఆరోపించారు. దీనివలన యాజమాన్యంతో కలిసి చేయవలసిన సమావేశాలులు జరగడం లేదని, కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారని విమర్శించారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ కార్మికుల సంక్షేమం మరిచి, ఆధిపత్యం కోసం పోటీ పడుతున్నాయని మండిపడ్డారు. అలాగే సింగరేణి ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యులు లేక కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని, సింగరేణి ఆస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులుగా మార్చి కార్మికులకు మెరుగైన వైద్య సౌకర్యాన్ని కల్పించాలన్నారు. కోలిండియాలో మాదిరిగా సింగరేణిలో కూడా ప్రతి సర్క్యులర్‌ని పొందుపరచాలని అన్నారు. సింగరేణి సంస్థ సీ అండ్ ఎండీ బలరాం ప్రతి ఒక్కరితో మాట్లాడుతూ కార్మికుల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయడం హర్షనీయమన్నారు. కార్మికుల సొంతింటి కలను యాజమాన్యం దృష్టిలో ఉంచుకొని నెరవేర్చలన్నారు. మెడికల్ బోర్డులో అవినీతి నిర్మూలనకు గతంలో మాదిరిగా దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికునికి వారసత్వ ఉద్యోగాన్ని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్, ట్రెజరర్ కస్తూరి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు సాయిల్ల శ్రీనివాస్, ఆర్జి-2 కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

మండల కేంద్రంలో ఫ్లాగ్‌మార్చ్



నవతెలంగాణ-సిరికొండ

రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలో పోలీసు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఇచ్చోడ సీఐ భీమేష్ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ బలగాలతో పురవీధుల గుండా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ భీమేష్ మాట్లాడుతూ ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు ఎస్పీ ఆదేశాలమేరకు మండల కేంద్రంలో కవాతు నిర్వహించామని, పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజల సహకరించాలని కోరారు. చట్ట విరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నవీన్, ఏఎస్ఐ అశోకొరెడ్డి, కానిస్టేబుల్ నవీన్ పాల్గొన్నారు.

కేంద్రంలో మరోసారి బీజేపీ రావాలి



నవతెలంగాణ-జన్నారం

కేంద్రంలో మరోసారి బీజేపీని అధికారంలోకి తెచ్చి నరేంద్ర మోడీని ప్రధాని చేయాలని, జన్నారం మండల బీజేపీ నూతన అధ్యక్షుడు, గుండవరపు మధుసూదన్ రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నూతనంగా, బీజేపీ మండల అధ్యక్ష బాధ్యతలు తీసుకున్న సందర్భంగా, కార్యకర్తలు నాయకులు అతనికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆదిలాబాద్ ఎంపీగా, గొడం నగేష్‌ను, భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి, ఎంపీ అభ్యర్థిని గెలిపిస్తూ కేంద్రంలో మోడీని ప్రధాని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొంతం శంకరయ్య, రాగుల సూర్యం, బొంతల మల్లేష్, మడుగు ప్రవీణ్, వీరాచారి, జలపతి పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలు చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

లోక్‌సభ ఎన్నికలలో భాగంగా మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉన్నందున ఎన్నికల నిర్వహణలో ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర ప్రిసైడింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి మంచిర్యాల శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.రాములుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తమకు అందించిన హ్యాండ్ బుక్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నిర్వహణ, పోలింగ్, కౌంటింగ్ కార్యక్రమాలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, పోలింగ్ రోజు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల విషయంలో ఇబ్బంది తలెత్తినట్లయితే వెంటనే చర్యలు తీసుకోవాలని, ఫారం-12డి, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో శాసనసభ నియోజకవర్గాల్లో 287 మొత్తంగా 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. అనంతరం బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల పనితీరు వివరించడంతో పాటు పోలింగ్ ప్రక్రియకు సంబంధించి ఫారంలు నింపే విధానంపై అవగాహన కల్పించారు.

'శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొనాలి'



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపాన పవిత్ర గోదావరి నది ఒడ్డున వెలసిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 17న నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలకు హాజరుకావాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం అందించారు. సోమవారం ఉట్నూర్‌లో వారి నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రాన్ని అందించారు. సానుకూలంగా స్పందించిన, ఎంపీ అభ్యర్థి సుగుణ, నవమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. శ్రీరామనవమి వేడుకల్లో తప్పకుండా పాల్గొంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కమల, భూమయ్య, కమ్మల గంగయ్య, రేగుంట ప్రదీప్, మైలారం భాస్కర్, గూగులావత్ రవి, శంకరయ్య, కొమురయ్య, కే.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని మాకులపేట గ్రామానికి చెందిన కొత్తపల్లి రాజేశం(58) నాగసముద్రం వద్ద కారు ఢీకొని మృతి చెందినట్లు దండపల్లి ఎస్ఐ సరూప్ రాజ్ తెలిపారు. మృతులు రాజసం సోమవారం ఉదయం మాకులపేట నుంచి తాళ్లపేట వైపునకు వెళ్తుండగా నాగసముద్రం వద్ద బ్రీజా కార్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుని భార్య సుమతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నవతెలంగాణ-జైపూర్

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించే రైతులు విధిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంక్ అధికారులు సూచించారు. సోమవారం కుందారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సంర్భంగా అధికారులు మాట్లాడుతూ కుందారం, పరిసర గ్రామాల వారు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి తరలించే ధాన్యం17 శాతంపేమ మించకుండా రైతులు జాగ్రత్త పడాలని తెలిపారు. కొనుగోలు కేంద్రం ద్వారా వరి ధాన్యం అమ్ముకున్న రైతులకు ఏ గ్రేడ్ రూ 2,2 03 బి గ్రేడ్ ధాన్యం రూ 2,183 చొప్పున ఖరీదు చేయడం జరుగుతుందని తెలిపారు. దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వపరంగా ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల ద్వారా



జైపూర్‌లో..



జన్నారంలో..

రైతులు వరి ధాన్యం అమ్ముకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం బ్యాంక్ ప్రతినిధులు అర్జున్ కుమార్, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు శేఖర్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

జన్నారం : డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సి.రాజ మనోహర్ రెడ్డి, ఎంపీడీఓ శశికళ అన్నారు. సోమవారం మండలంలోని మొర్రిగూడా గ్రామములో తిరుమల గ్రామాఖ్య సంఘం డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా, ప్రభుత్వం నిర్వహించే వరి కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం బుజ్జన్న సీసీలు వసుంధర మండల సమాఖ్య ఓబీలు పాల్గొన్నారు.

ఘనంగా మాలగాని మల్లన్న బోనాల జాతర



నవతెలంగాణ-దండేపల్లి

దండేపల్లి మండల కేంద్రంలో గల మాలగని మల్లన్న ఆలయం వద్ద బోనాల జాతర స్థానిక యాదవ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి మహిళలు బోనాలతో ఆలయ వద్దకు ర్యాలీగా వచ్చి జాతరను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు మారుమూల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో ఆలయం వద్ద భక్తులతో సందడి నెలకొంది. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావులు ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-తాంసి

మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, తాంసి ఎంపీటీసీ వన్నెల నరేస్‌తో పాటు సుమారు మూడు వందల మంది నాయకులు కార్యకర్తలు సోమవారం ఇచ్చోడలో మంత్రి సీతక్క, బోథ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గజేందర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. చేరిన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలన్నారు.

మందపల్లి పశువుల సంత వేలం వాయిదా

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మందపల్లి గ్రామంలో ప్రతి సోమవారం నిర్వహించే పశువుల సంత వేలం పాటను వాయిదా వేసినట్లు గ్రామ కార్యదర్శి లకావత్ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఎన్నకల కోడ్ అమల్లో ఉన్నందున వేలం పాట వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. మళ్లీ వేలం పాటను నిర్వహించే తేదీలను ప్రకటిస్తామన్నారు. రైతులు ప్రజలు గ్రహించాలని కోరారు.

6న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-జన్నారం

ఈ నెల ఆరవ తేదీన జన్నారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శశికళ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్వసభ్య సమావేశానికి మంచిర్యాల జడ్పీ చైర్‌పర్సన్ నల్లల భాగ్యలక్ష్మి ఓదెలు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విట్టల్ ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్,, స్థానిక జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్‌లు హాజరవుతారన్నారు. ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు అధికారులు సమయపాల పాటించి, మండల సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు : పీఎస్ఆర్

నవతెలంగాణ-దండేపల్లి

ప్రజా సంక్షేమ ధ్యేయంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పన లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. వెంకటపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గత పాలకులు ప్రజలను మోసపూరిత హామీలతో మభ్యపెట్టి ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోని ఇచ్చిన హామీలను సగానికి పైగా నెరవేర్చిందని ఆయన అన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని రైతులు ఎవరు కూడా అందులో చదవద్దని ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు జరుగుతుందని ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని మల్లన్న బోనాల జాతరను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రచార ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



అంబలి పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

ప్రచార రథాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రచార రథాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి సీతక్క జెండా ఊపి ప్రారంభించారు. మావల పరిధిలోని రత్నా గార్డెన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సమావేశం అనంతరం ప్రచార రథాన్ని ప్రారంభించారు. భారీ మెజారిటీతో ఘన విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగు పెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్, ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డీ భోజారెడ్డి, మాజీ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా అసెంబ్లీ ఇన్‌చార్జీలు ఆడే గజేందర్, శ్యాం నాయక్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ పాల్గొన్నారు.